దివ్యాంగుల సంక్షేమ భవనం ప్రారంభం



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి, మేయర్ పారిజాతారెడ్డి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్‌లో ఉన్న మర్రి లక్ష్మమ్మ వెంచర్‌లో రూ.25 లక్షలతో నిర్మించిన దివ్యాంగుల సంక్షేమ భవనాన్ని మంగళవారం ఎమ్మెల్యే సబితారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పారిజాతారెడ్డి హాజరయ్యారు. దివ్యాంగుల సంక్షేమానికి కట్టుబడి ఉంటామని వారు తెలిపారు. దివ్యాంగులను గుర్తించి భవనాన్ని నిర్మించిన ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఆ సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ సుమన్‌రావు, కార్పొరేటర్ శ్రీధర్‌రెడ్డి, పలు డివిజన్ల కార్పొరేటర్లు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

21 నుంచి రిపబ్లిక్ డే బ్యాడ్మింటన్ టోర్నమెంట్

మలక్‌పేట: దిల్‌సుఖ్‌నగర్ షటిల్ ప్లేయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 19వ ఇన్విటేషనల్ రిపబ్లిక్ డే బ్యాడ్మింటన్ టోర్నమెంట్–2024ను ఈనెల 21 నుంచి ఐదు రోజుల పాటు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ హైదరాబాద్ సౌజన్యంతో ఈ పోటీలు జరుగుతాయని మంగళవారం అసోసియేషన్ చైర్మన్ సామ ప్రభాకర్‌రెడ్డి, కన్వీనర్ కర్రెడ్ల శ్రీనివాసరావు వెల్లడించారు. 19, 35, 50 ఏళ్ల పురుషుల డబుల్స్‌లో బ్యాడ్మింటన్ క్రీడాకారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. మూసారంబాగ్ డివిజన్ ఎస్‌బీహెచ్ కాలనీ జీహెచ్‌ఎంసీ ప్లేగ్రౌండ్స్‌లో ఈనెల 21 నుంచి 25 తేదీ వరకు ఉదయం 5.30 నుంచి 9 గంటల వరకు పోటీలు జరుగుతాయన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఈనెల 19 తేదీలోపుగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 98663 31280 సెల్ నంబర్‌లో సంప్రదించవచ్చని అన్నారు.

సేవా కార్యక్రమాల్లో ముందుండాలి

హస్తినాపురం: ఆర్యవైశ్యులు సేవా కార్యక్రమాలలో ముందుండాలని హస్తినాపురం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నీల మధుసూదన్‌గుప్తా అన్నారు. సంఘం 2024 నూతన సంవత్సరం కేలండర్‌ను మంగళవారం ఆయన సంఘం సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మధుసూదన్ గుప్తా మాట్లాడుతూ, తమ సంఘం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలతో పాటు, ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బిజాల వేణుగుప్తా, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు కేంద్రం ప్రారంభం



ఓటరు నమోదు కేంద్రాన్ని ప్రారంభించిన కార్పొరేటర్ పవన్‌కుమార్

లింగోజిగూడ: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ పవన్‌కుమార్ సూచించారు. డివిజన్ పరిధిలోని ప్రజానివాస్ ఫేజ్–1లో వాస్విక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత ఓటరు నమోదు కేంద్రాన్ని మంగళవారం కార్పొరేటర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో కాలనీ వాసులు ప్రసాద్, సాయి, ఫౌండేషన్ సభ్యులు శ్రీకాంత్, నాయకులు అశ్విన్‌సింగ్, తిరుమల్, మహేష్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్పొరేషన్ పదవుల్లో కురుమలకు ప్రాధాన్యమివ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీర్ల ఐలయ్య

అఫ్జల్‌గంజ్: కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవస్థానం చైర్మన్‌గా కురుమలనే నియమించాలని ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేసినట్లు ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య తెలిపారు. అదే విధంగా షీప్ అండ్ గోట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌తో పాటు ఇతర చైర్మన్ స్థానాలల్లో కురుమలకు ప్రాధాన్యమివ్వాలని కోరారు. ఆలేరు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన కురుమ కులానికి చెందిన బీర్ల ఐలయ్యను మంగళవారం ముస్లింజంగ్ పూల్ బ్రిడ్జి వద్ద ఉన్న రాష్ట్ర కురుమ సంఘం భవనంలో రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేషం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జవహర్‌నగర్ కార్పొరేషన్ మేయర్ కావ్య, కురుమ సంఘం రాష్ట్ర, నగర నాయకులు బండారు నారాయణ, కొలుపుల నరసింహ, కట్ట మల్లేషం, కెజి కృష్ణమూర్తి, రెక్కా ల కొండల్ రాజ్, ఎక్కాల కన్నా, నర్స వినోద్, చీర శ్రీకాంత్, కెంద్యాల శ్రీనివాస్, వస్పరి శంకర్, గొరిగె మల్లేష్, ఒగ్గు కుమార స్వామి, బెజిని శ్రీనివాస్, ఒగ్గు బీరప్ప, యాదయ్య, బాలమణి పాల్గొన్నారు.

వైభవంగా చండీయాగం



యాగం నిర్వహిస్తున్న పండితులు

కందుకూరు: మండలంలోని పులిమామిడి పరిధిలోని శ్రీనిఖిల్ చేతనా కేంద్రంలో సహస్ర చండీ మహాయాగాన్ని బ్రహ్మశ్రీ గురూజీ అనిల్‌కుమార్‌జోషి ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభించారు. ఈ నెల 5వ తేదీ నుంచి 52 మంది వేద బ్రాహ్మణులతో సహస్ర చండీ పారాయణాన్ని చేపట్టారు. అందులో భాగంగా పండితుల మంత్రోచ్ఛరణల నడుమ సహస్ర గణపతి హోమం, రుద్ర హోమాన్ని వైభవంగా నిర్వహించారు. అంతకుముందు శ్రీనిఖిలేశ్వరానందస్వామి నవగ్రహాలు, గణపతి, మహాకాళి, మహాచండీ, దేవతా మూర్తులు తదితర విగ్రహాలకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఊరెళ్తున్నారా.. ఇల్లు జర భద్రం: ఏసీపీ



ప్రచార ఆటోను ప్రారంభిస్తున్న ఏసీపీ భీంరెడ్డి

హస్తినాపురం: నగరం నుంచి సంక్రాంతి పండుగకు ఊరికి వెళ్లే వారు విలువైన వస్తువులను, నగదును ఇంట్లో పెట్టకుండా బ్యాంకు లాకర్లలో లేదా బ్యాంకుల్లో భద్రపర్చుకోవాలని వనస్థలిపురం ఏసీపీ ఎస్.భీంరెడ్డి అన్నారు. సంక్రాంతి పండుగను దృష్టిలో ఉంచుకుని ప్రజలను అప్రమత్తం చేసేందుకు ఉద్దేశించిన ప్రచార ఆటోను మంగళవారం సీఐ వెంకట్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ భీంరెడ్డి మాట్లాడుతూ, సంక్రాంతి పండుగకు ఊర్లో సమయంలో వీలైనంతవరకు ఇంటి ముందు తలుపులకు సెంటర్ లాక్ వేసి బయట గొళ్లెం పెట్టవద్దన్నారు. ఇంటి తలుపుల ముందు చెప్పులు ఉంచాలని, బయట గేటుకు లోపల నుంచి తాళం వేయాలని సూచించారు. ఇంట్లోని ముందు గదిలో లైటువేసి ఉంచాలని, పేపర్‌బాయ్‌ని, పాలు పోసే వాళ్లకు తాము ఊరు నుంచి వచ్చే వరకు రావద్దని సమాచారం ఇవ్వాలన్నారు. ఇంట్లోని బీరువాలో ఎట్టి పరిస్థితుల్లో నగదు, విలువైన బంగారు, వెండి ఆభరణాలు ఉంచవద్దన్నారు. ఊరుకు వెళ్తున్న విషయంపై ముందుగా మీ సమీప బంధువులకు, మిత్రులకు, స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఏసీపీ వెల్లడించారు. కార్యక్రమంలో వనస్థలిపురం సీఐ బి.వెంకట్, ఎస్‌ఐలు జగన్, మాధవరెడ్డి పాల్గొన్నారు.

మహిళలను వేధిస్తే కఠిన చర్యలు



ఆకతాయిలకు కౌన్సెలింగ్ ఇస్తున్న షీ టీమ్స్ సిబ్బంది

షీ టీమ్ డీసీపీ ఉషా విశ్వానాథ్

లింగోజిగూడ: యువతులు, మహిళలను వేధించడం, ఇబ్బందులకు గురి చేయడం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాచకొండ కమిషనరేట్ షీ టీమ్స్ డీసీపీ ఉషా విశ్వనాథ్ హెచ్చరించారు.రాచకొండ కమిషనరేట్ పరిధిలోని కళాశాలలు, షాపింగ్ మాల్స్, బస్టాండ్‌లు, వివిధ ప్రాంతాలలో యువతులు, మహిళలను వేధిస్తున్న 224 మంది (మేజర్లు 140, మైనర్లు 84)లకు మంగళవారం ఎల్‌బీనగర్ సీపీ క్యాంప్ కార్యాలయంలోని షీ టీమ్స్ వింగ్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ ఉష మాట్లాడుతూ, యువతులు, మహిళలకు అన్ని విధాల అండగా ఉంటామని, ఎవ్వరికీ భయపడకుండా ఫిర్యాదులు చేయాలని సూచించారు. గత నెల అందిన ఫిర్యాదులను పరిశీలించి మహిళలను, యువతులను వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా వేధిస్తున్న వారిని గుర్తించి వారికి కూడా కౌన్సెలింగ్ ఇస్తామన్నారు. మరోసారి ఇలాంటి తప్పులను చేస్తే కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో షీ టీమ్స్ ఏసీపీ వెంకటేశం, సీఐ పరశురాం, ఎస్ఐ రాజు, కౌన్సిలింగ్ సిబ్బంది శాంతిప్రియ, రమ్య, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

స్టీల్ బ్రిడ్జి పనులను పరిశీలించిన అధికారులు



పరిశీలనకు వచ్చిన అధికారులతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

సైదాబాద్: చంచల్‌గూడ చౌరస్తా నుంచి సంతోష్‌నగర్ వరకు నిర్మిస్తున్న స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనులను ప్రాజెక్ట్ అధికారులు పరిశీలించారు. సైదాబాద్ ప్రధాన రహదారిపై ఉన్న పురాతన హనుమాన్ ఆలయం వద్ద మొదట ప్రతిపాదించిన నమూనాను మార్చి బ్రిడ్జి నిర్మిస్తున్నారని బీజేపీ నాయకులు జీహెచ్ఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు ప్రాజెక్ట్ సీఈ దేవానంద్ ఆధ్వర్యంలోని అధికారుల బృందం మంగళవారం సైదాబాద్ ప్రధాన రహదారిపై కొనసాగుతున్న స్టీల్ బ్రిడ్జి పనులను పరిశీలించారు. అధికారుల పర్యటన గురించి తెలుసుకున్న బీజేపీ నాయకులు అక్కడికి చేరుకున్నారు. భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా హనుమాన్ ఆలయం వద్ద మొదట ప్రతిపాదించినట్లుగా నిర్మించాలని వారు ప్రాజెక్ట్ సీఈని కోరారు. కార్యక్రమంలో బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, హైదరాబాద్ మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్జీ, సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణా రవీందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ సహదేవ్‌యాదవ్ పాల్గొన్నారు.

వేగంగా ప్రజాపాలన దరఖాస్తుల డేటా ఎంట్రీ



అఫ్జల్‌నగర కమ్యూనిటీహాల్‌లో డేటా ఎంట్రీ చేస్తున్న ఆపరేటర్లు

చాదర్‌ఘాట్: ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల డేటా ఎంట్రీ వేగంగా నిర్వహిస్తున్నామని మలక్‌పేట సర్కిల్–6 డీసీ జయంత్ తెలిపారు. మంగళవారం అఫ్జల్‌నగర్‌లోని డేటా ఎంట్రీ కార్యాలయంలో డేటా ఎంట్రీ జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత మూడురోజుల నుంచి మంగళవారం వరకు దాదాపు 8వేల దరఖాస్తులు ఎంట్రీ చేశామన్నారు.70 మంది ఆపరేటర్లతో నిరంతరం ఎంట్రీలు చేస్తున్నామని చెప్పారు. సర్కిల్–6లో ప్రజాపాలనలో మొత్తం 72,469 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఏఎంసీ మురళీమోహన్ పర్యవేక్షణలో దరఖాస్తుల డేటా ఎంట్రీ జరుగుతోందన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి అండగా

ఆపన్నహస్తం అందించిన పహాడీషరీఫ్ పోలీసులు

పహాడీషరీఫ్: అనారోగ్యంతో మృతి చెందిన కానిస్టేబుల్ కుటుంబానికి అండగా నిలిచి పహాడీషరీఫ్ పోలీసులు మానవత్వాన్ని చాటుకున్నారు. గత నెలలో మృతి చెందిన సదానందం అనే కానిస్టేబుల్ కుటుంబానికి తోడ్పాటునివ్వాలని పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న అన్ని స్థాయిల అధికారులు, సిబ్బంది విరాళాలుగా రూ.1.70 లక్షలను జమ చేశారు. మంగళవారం నగదును మృతుడి భార్యకు ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఎస్సైలు శ్రీనివాస్, భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.



మృతి చెందిన కానిస్టేబుల్ భార్యకు ఆర్థిక సాయం అందజేస్తున్న పోలీసులు

రైతు బజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాటా 17, వంకాయ 28, బెండ 45, పచ్చిమిర్చి 45, కాకర 52, బీర 40, క్యాబేజీ 17, ఫ్రెంచిబీన్స్ 35, క్యారెట్ 31, దొండ 28, చిక్కుడు 28–45, గోకర 50, బీట్‌రూట్ 17, క్యాప్సికం 55, ఆలు 19–24, దోస 28, సొర 11, పొట్ల 13, ఉల్లిగడ్డ 24, చామగడ్డ 55. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

భక్తిశ్రద్ధలతో దీపోత్సవం



ఆండాళ్ నిలయంలో పూజలకు హాజరైన భక్తులు

మలక్‌పేట: ధనుర్మాస తిరుప్పావై ప్రవచనోత్సవాల్లో భాగంగా మంగళవారం మూసారంబాగ్ ఆండాళ్ నిలయంలో దీపోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కర్పూర నీరాజనాలు, మంగళ శాసనం గావించారు. ఈనెల 12 శుక్రవారం కూడారై ఆండాళ్ తల్లికి నీరాటోత్సవం, 108 గంగాళాలతో అక్కర వడిశల్ ప్రసాద నివేదన ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో రామకృష్ణ, రూపాదేవి తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ పాఠశాలలో పుస్తకాల వితరణ




లింగోజిగూడ: ఎల్‌బీ నగర్ మైనార్టీ పాఠశాలలో మంగళవారం ఎల్‌బీనగర్‌కు చెందిన సందీప్‌గౌడ్ రూ.40 వేలు విలువ చేసే జనరల్ నాలెడ్జ్ పుస్తకాలను విద్యార్థులకు ఉచితంగా అందజేశారు. పుస్తకాలు పెట్టుకోవడానికి ర్యాక్‌లను కూడా అందజేశారు. అనంతరం సందీప్‌గౌడ్ మాట్లాడుతూ, విద్యార్థులకు సాయం చేయడానికి యువత ముందుకు రావాలని, విద్యార్థులకు ఎలాంటి అవసరం ఉన్నా అందుబాటులో ఉంటానని తెలిపారు.

ఎల్లమ్మకు విశేష పూజలు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. అమ్మవారి ఇష్టమైన మంగళవారం కావడంతో ప్రత్యేక పూజలు చేశారు. బోనం నైవేద్యంగా సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, సిబ్బంది కాశీనాథ్, పూజరులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

లూయిస్ బ్రెయిలీ జీవితం ఆదర్శనీయం



చిక్కడపల్లి: అంధులకు ఒక లిపిని రూపొందించిన లూయిస్ బ్రెయిలీ జీవితం ప్రతి ఒక్కరికీ ప్రేరణనిస్తుందని సీబీఐ న్యాయస్థానం విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ నాగ మారుతీశర్మ అన్నారు. మంగళవారం చిక్కడపల్లి త్యాగరాయగానసభలోని కళాసుబ్బారావు కళావేదికపై శతాబ్ది పూర్వ మహనీయులు యాదిలో భాగంగా గానసభ నిర్వహణలో లూయిస్ బ్రెయిలీ సంస్మరణ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని నివాళుల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అంధులు చదువుకు దూరమవుతున్నారన్న వేదనతో బ్రెయిలీ వారి కోసం ప్రత్యేక లిపిని కనిపెట్టి ఆశాజ్యోతిగా వారి జీవితాలను వెలుగులమయం చేశారని వివరించారు. పరులకోసం పాటుపడే వారు నిత్యస్మరణీయులన్నారు. గానసభ అధ్యక్షుడు కళాజనార్దనమూర్తి, కొల్లి నాగేశ్వర్‌రావు, శంకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీలోని ప్రతి సమస్యనూ పరిష్కరిస్తా



శ్రీపురం కాలనీ ఫేజ్- 2లో పర్యటిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: కాలనీలోని ప్రతి సమస్యనూ పరిష్కరించేందుకు కృషి చేస్తానని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని శ్రీపురం కాలనీ ఫేజ్–2 కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు మంగళవారం కాలనీ వాసులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు కాలనీలో నెలకొన్న విద్యుత్, డ్రైనేజీ, రోడ్లు, వీధి దీపాలు వంటి సమస్యలను ఆయన దృష్టికి తసుకొచ్చారు.అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ, ప్రణాళికాబద్ధంగా కాలనీలో ఉన్న సమస్యలను ఒక్కొక్కటి పరిష్కరిస్తానని తెలిపారు. కాలనీని ఎప్పటికప్పుడు శుభ్రపరిచే విధంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల ఏఈలు రాకేష్, రణధీర్, రవీందర్‌రెడ్డి, నాయకులు భూపాల్‌రెడ్డి, బొమ్మ రఘురాంనేత, విష్ణువర్ధన్, శ్రావణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రిక్షాలోనే చెత్తను వేయాలి...

బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో శానిటేషన్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన దుకాణదారులకు అవగాహన కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పాల్గొన్నారు. తడి, పొడి చెత్తను వేరు వేరుగా వేయాలని సూచించారు.చెత్తను చెత్త రిక్షాలలోనే వేయాలని, బయట ఎక్కడా వేయకూడదని తెలిపారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో ప్రతిభ కనబర్చాలి



వార్షికోత్సవంలో నృత్యం చేస్తున్న జాన్సన్ స్కూల్ విద్యార్థులు

మన్సూరాబాద్: విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో ప్రతిభను కనబర్చాలని, అలాంటప్పుడే వారు సమాజంలో రాణించగలుగుతారని ఎన్‌జీఆర్‌ఐ ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం.రామ్మోహన్, డాక్టర్ శ్రీనివాస్‌శర్మ అన్నారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని ఎంఈ రెడ్డి గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన జాన్సన్ గ్రామర్ స్కూలు వార్షికోత్సవానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో జాన్సన్ స్కూల్ డైరెక్టర్ సురేష్, అకడమిక్ డైరెక్టర్ లక్ష్మీ విశ్వనాథన్, స్కూల్ అడ్మిన్ అపర్ణ, ప్రధానోపాధ్యాయులు విద్యావ్యాస్ , విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

జల్‌పల్లిలో కొత్త రేషన్ దుకాణాలు



షాహిన్‌నగర్‌లో రేషన్ దుకాణాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ అబ్దుల్లా సాది

పహాడీషరీఫ్: ఎట్టకేలకు జల్‌పల్లి మున్సిపాలిటీలో కొత్త రేషన్ దుకాణాలు ప్రారంభమయ్యాయి. అరకొరగా ఉన్న చౌక ధరల దుకాణాల వద్ద గతంలో ప్రజలు బారులు తీరుతూ ఇబ్బందులు పడేవారు. ఒక్కో రేషన్ దుకాణానికి వేల సంఖ్యలో కార్డుదారులు ఉండడం.. సరుకులు తీసుకోవడానికి ఆయా షాప్‌ల వద్ద నాలుగైదు కిలోమీటర్లు తిరగాల్సి వస్తున్న నేపథ్యంలో అధికారులు నూతన రేషన్ దుకాణాలు మంజూరు చేశారు. తాజాగా శ్రీరాం కాలనీ, వాదే ముస్తఫా బస్తీలో కొత్తగా దుకాణాలు ఏర్పడ్డాయి. బాలాపూర్ గ్రామంలోని రేషన్ దుకాణానికి అనుసంధానంగా లబ్ధిదారులకు సౌకర్యవంతంగా ఉండేందుకు షాహిన్‌నగర్‌లో దుకాణాలను ఏర్పాటు చేశారు. దీన్ని మంగళవారం జల్‌పల్లి మున్సిపాలిటీ చైర్మన్ అబ్దుల్లా సాది ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఫర్హానా నాజ్, కౌన్సిలర్లు శంషూద్దీన్, షేక్ ఫమిదా అఫ్జల్, మాజీ వైస్ ఎంపీపీ ఉమర్ బామ్, నాయకులు సయ్యద్ యూసుఫ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి



రిలే నిరాహార దీక్ష చేపడుతున్న రైల్వే కార్మికులు

నాంపల్లి: కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ స్కీమ్‌ను పునరుద్ధరించాలని దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ సికింద్రాబాద్ డివిజన్ అధ్యక్షుడు ఎన్‌వీఎన్ చౌదరి డిమాండ్ చేశారు. ఎన్‌ఎఫ్ఐఆర్, జాయింట్ ఫోరం ఆఫ్ రీస్టోరేషన్ ఓపీఎస్ సంస్థల సంయుక్త నిర్వహణలో మంగళవారం పాత పెన్షన్‌ను విధానాన్ని వర్తింపజేయాలని కోరుతూ హైదరాబాద్ రైల్వే స్టేషన్ ప్రాంగణంలో రైల్వే కార్మికులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎన్‌వీఎన్ చౌదరి మాట్లాడుతూ..కొత్త పెన్షన్ విధానంతో రైల్వే కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. రైల్వే కార్మికులకు నేవీ, ఆర్మీ ఉద్యోగులకు ఇచ్చినట్లుగా పాత పెన్షన్ స్కీమ్‌ను వర్తింపజేయాలని కోరారు. కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేయకపోతే దేశవ్యాప్తంగా రైళ్లను స్తంభింపజేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి ప్రభురాజ్, ఎస్‌సీఆర్‌ఈ సంఘ్ అసిస్టెంట్ జనరల్ సెక్రెటరీ, భరణి భాను ప్రసాద్, నేతలు వి.ఎస్.మురళీ, సత్యకుమార్‌రెడ్డి, ఎ.మధుసూదన్, ఈఎస్. శ్రీనివాస్, రాజు, శ్రీజ్యోతి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేర రహిత సమాజానికి సహకరించండి

● ఫుట్ పెట్రోలింగ్‌కు శ్రీకారం

పహాడీషరీఫ్: నేరాల నివారణ కోసం బాలాపూర్ పోలీసులు ఫుట్ పెట్రోలింగ్‌కు శ్రీకారం చుట్టారు. బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ బి.వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్సై యూసుఫ్ జానీ, పెట్రోలింగ్ మొబైల్, బీసీ–4 సిబ్బందితో కలిసి మంగళవారం షాహిన్‌నగర్ పరిసరాలలో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో మమేకమై నేరాలు, శాంతి భద్రతలకు సంబంధించిన విషయాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా అసాంఘిక శక్తుల కదలికలపై ఆరా తీశారు. అనంతరం తూర్ కాలనీలో సమావేశం ఏర్పాటు చేశారు. ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి పౌరుడు యూనిఫాం ధరించని పోలీస్‌గానే భావించాలన్నారు. నేర రహిత సమాజం కోసం పోలీసులకు సహకరించాలన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. కార్యక్రమంలో స్థానికులు ఇక్బాల్ బిన్‌ఖలీఫా తదితరులు పాల్గొన్నారు.



తూర్ కాలనీలో సమావేశమైన ఇన్‌స్పెక్టర్ వెంకట్ రెడ్డి